క్లుప్తంగా

గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం



గుంతలను పరిశీలిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

జగదేవ్‌పూర్(గజ్వేల్): గుంతలు పడి ప్రమాదకరంగా మారిన జగదేవ్‌పూర్ నుంచి మునిగడపకు వెళ్లే బ్రిడ్జిపై గుంతలను త్వరలోనే పూడుస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. గురువారం సాక్షిలో ప్రచురితమైన ×ఆదిమరిస్తే అంతే× అనే కథనానికి ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి స్పందించారు. రోడ్డుపై ప్రమాదకర గుంతలను పరిశీలించారు. అధికారులను దృష్టికి తీసుకపోయి గుంతలను పూడ్చి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వాహనదారులు వేగంగా ప్రయాణించవద్దని సూచించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



విద్యార్థిని పరీక్షిస్తున్న సరిత

నంగునూరు(సిద్దిపేట): వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అంటు వ్యాధులు దూరమవుతాయని వైద్యాధికారి సరిత సూచించారు. పాలమాకుల ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించి వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ గణేశ్, హెల్త్ సూపర్‌వైజర్ అనురాధ, మహేందర్, జ్యోతి, బాల్‌లక్ష్మి, కవిత, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–2003లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు గురువారం హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డికి రూ.20 వేల విలువైన క్రీడా సామగ్రి అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రసులాబాద్ మాజీ సర్పంచ్ స్వామి, కాజా మైదొద్దీన్, ప్రశాంత్‌రెడ్డి, సంపత్, శ్రీలత, కృష్ణ, సుదర్శన్, ప్రవీణ్, శేఖర్, మహిపాల్, బాలకృష్ణ, కనకయ్య, బాబు, వేణుగోపాల్, యాదగిరి పాల్గొన్నారు.

రుద్రారంలో వైద్య శిబిరం



మందులు అందిస్తున్న సిబ్బంది

మిరుదొడ్డి(దుబ్బాక): మేడ్చల్ మెడిసిటీ ఆధ్వర్యంలో అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరంలో బీపీ, షుగర్, చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్ లాంటి సమస్యలపై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఆపరేషన్ అవసరం ఉన్న 48 మందిని ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, నవీన్, నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ పటిష్టతకు చర్యలు తీసుకోవాలి

దౌల్తాబాద్(దుబ్బాక): విద్యారంగ పటిష్టతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి అన్నారు. దౌల్తాబాద్, అహ్మద్‌గర్, తిర్మలాపూర్, ముబారస్‌పూర్, మల్లేశంపల్లి, శేరిపల్లి, ఉప్పరిపల్లి, కోనాపూర్, నర్సంపేట, లింగరాజుపల్లి, దీపాయంపల్లి, గొడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆయన సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రచారజాత ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షకు పైగా విద్యార్థుల నమోదు జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్‌వలి అహ్మద్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, శివలింగం, రవీందర్, మహేశ్వరి, చందు తదితరులు పాల్గొన్నారు.

తస్మాత్ జాగ్రత్త!

విద్యుత్‌తో చెలగాటం వద్దు
- వానాకాలం.. రైతులు జర భద్రం
- సొంత మరమ్మతులు చేయొద్దు
- సిబ్బందితోనే చేయించాలి: అధికారులు

వానాకాలం వచ్చిందంటే చాలు జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగానే చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలి. తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలి. అనుభవం లేకుండా ఫ్యూజులు, బల్బులు మార్చడం, మోటార్లకు మరమ్మతులు చేయడం లాంటివి చేస్తే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్టే..



దుబ్బాక సబ్‌స్టేషన్



దుబ్బాకటౌన్: రైతులు సాగుకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో బోరు బావుల వద్ద మోటార్ల వినియోగంలో జాగత్తలు పాటిస్తే సురక్షితంగా ఉండవచ్చు. ఇంటిలో ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. రేకుల ఇళ్లకు విద్యుత్ తీగలు తగలకుండా చూసుకోవాలి. ఈ క్రమంలో విద్యుత్ అధికారుల సూచనలు.. సలహాలు..

సొంత రిపేర్లు చేయొద్దు

వర్షాకాలంలో ఈదురు గాలులు వీయడం వల్ల చెట్లు విరిగి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యలు తలెత్తుతాయి. దీంతో రైతులు తామే చిన్నచిన్న మరమ్మతులు చేస్తుంటారు. అలాంటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోక షాక్ తగిలే అవకాశాలు ఎక్కువ. ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయాల్సి వస్తే తప్పకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

మరికొన్ని జాగ్రత్తలు..

చాలా మంది సెల్‌ఫోన్ చార్జింగ్‌లో ఉండగా ఫోన్ మాట్లాడుతుంటారు. అలా చేయడం వల్ల ఫోన్ పేలిపోయే అవకాశాలు ఎక్కువ. అలాగే ఇంటి వద్ద దుస్తులు ఆర వేసేటప్పుడు విద్యుత్ వైర్లకు దూరంగా ఆరవేయాలి. ఎక్కడైనా కర్రలకు విద్యుత్ వైర్లు బిగించి ఉంటే ఆ ప్రదేశాలకు దూరంగా ఉండాలి.

మోటార్ల విషయంలో..
- ఎర్తింగ్ తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలి
- వర్షం కురిస్తే స్విచ్‌లు తడవకుండా చూసుకోవాలి
- ట్రాన్స్‌ఫార్మర్, స్టార్టర్ బాక్స్‌ల చుట్టూ పిచ్చి మొక్కలు, పొదలు పెరగకుండా చూసుకోవాలి.
- ఎలాంటి పరిస్థితిలోను తెగిన విద్యుత్ తీగలను తాకవద్దు. విద్యుత్ సిబ్బంది వచ్చేంత వరకు వాటి చుట్టూ ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలి.
- పశువులను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లకుండా ఉండేలా చూసుకోవాలి.

అందుబాటులో ఉంటాం..



ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే సిబ్బందికి తెలియజేయాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలు, తీగలు, స్విచ్‌లను తాకకూడదు. ట్రాన్స్‌ఫార్లర్లు, స్టార్టర్ బాక్స్‌లు, మోటార్ల వద్ద జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారు.

– కనకరాజు, విద్యుత్ ఏఈ, దుబ్బాక

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం

రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి



క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని, క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు పాల్గొనాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని లక్ష్మక్కపల్లిలో శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణుజగతి, సభ్యుల ఆధ్వర్యంలో విజన్-2లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు విష్ణుజగతి మాట్లాడుతూ క్రీడా పోటీలు మూడు రోజులపాటు కొనసాగుతాయన్నారు. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. ముందుగా సీఐ జెండా ఊపి 2కే రన్ ప్రారంభించారు. నియోజక వర్గంలోని పలు పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.3 లక్షల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, ట్రస్ట్ ప్రతినిధులు రవికుమార్, మల్లేశం, ఆంజనేయులు, చంటి, చంద్రశేఖర్, సత్యనారాయణ, పురుషోత్తం, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలతలు తెలపకుండా నష్టపరిహారమా?

ఆర్డీఓ కార్యాలయం ఎదుట మిట్టపల్లి వాసుల నిరసన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సిద్దిపేటఅర్బన్: రంగాదంపల్లి నుంచి మిట్టపల్లి వరకు నిర్మిస్తున్న బ్రిడ్జ్ నిర్మాణంపై అధికారులు పూర్తిస్థాయిలో నోటీసులు ఇవ్వకుండా.. కొలతలు తెలపకుండానే నష్టపరిహారం తీసుకోమని చెప్పడం ఏమిటని పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ సంతోష్ వాపోయారు. సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట భూ బాధితులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో 50 ఫీట్ల వరకు మార్కింగ్ ఇచ్చారన్నారు. అప్పుడు నిరసన కార్యక్రమాలు చేపడితే కొంత వరకు తగ్గిస్తామని చెప్పిన అధికారులు ఎంత తగ్గించారో తెలియజేయ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ భూమి గజానికి రూ.2,100 ఉంటే ప్రభుత్వం రూ.300 ఇస్తామనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గవర్నమెంట్ విలువకు మూడు రెట్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గజాల చొప్పున లెక్కకట్టి పరిహారం చెల్లించాలని కోరారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన కొలతలను పూర్తిస్థాయిలో తెలిపి నష్టపరిహారం పెంచాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు రాజు, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆ స్కూళ్ల గుర్తింపు రద్దు చేయండి

డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శివరాజ్



కలెక్టర్ హైమావతికి వినతి పత్రం ఇస్తున్న శివరాజ్

హుస్నాబాద్: సిద్దిపేట, హుస్నాబాద్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ గురువారం కలెక్టర్ హైమావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, టైలు, బెల్టులను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. విద్యా ప్రమాణాలు పాటించకుండా, ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా వ్యాపారమే ధ్యేయంగా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని వాపోయారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ స్కూల్స్‌పై తనిఖీలు చేపట్టి ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ

మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్



పనులను పర్యవేక్షిస్తున్న రమేశ్‌కుమార్

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ తెలిపారు. మున్సిపల్ పరిధిలో వంద రోజులు- యాక్షన్ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా గురువారం లచ్చపేట 10వ వార్డులో ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు అందించి, పిచ్చి మొక్కలు, వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దోమల నివారణకు ప్రతి వార్డులో రాత్రివేళ ఫాగింగ్ చేయిస్తున్నామని, డ్రైనేజీల నిర్మాణం కోసం పై అధికారులకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. అలాగే వీధి కుక్కలను యానిమల్ బర్త్ కేంద్రానికి తరలిస్తామని, అంగడి బజార్లో నీరు నిలిచిపోకుండా 1, 2 రోజుల్లో చిన్నపాటి కాలువ నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది దిలీప్, ప్రవీణ్, అనిల్ తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

ములుగు(గజ్వేల్): పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పంచాయతీ కార్మికులందరూ పాల్గొంటారని తెలియజేస్తూ గురువారం ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారికి కార్మికులతో కలసి ఆయన సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, 12 గంటల పనివిధానం అమలు చేయాలని కుట్ర చేస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇన్సూరెన్సు కట్టాలని, గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. కార్మికులు విధులు బహిష్కరించి దేశవ్యాప్త సమ్మెలో తమ నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్, దశరథ, యాదగిరి, యాదయ్య, నాగరాజ్, మల్లేశ్, లక్ష్మి, సుగుణ, బాబు, భిక్షపతి, బాలయ్య, స్వామి పాల్గొన్నారు.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

ఏసీపీ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్: ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వహించాలని ఏసీపీ రవీందర్‌రెడ్డి సూచించారు. సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సభ్యుల నియామకం

దుబ్బాక: దుబ్బాక మున్సిపాల్టీ పరిధిలోని రేకులకుంట మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి 10 మంది సభ్యులను నియమించారని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి గురువారం తెలిపారు. సభ్యులుగా ముదిగొండ ధర్మపురి, చిట్యాల ధనంజయ, బాలరాజు, బాస మధు, పయ్యావుల పోచయ్య, పరికి బాలగౌడ్, కిష్టంగారి శ్రీనివాస్‌రెడ్డి, పెంబర్తి బాలకిషన్, గుండెల్లి వరలక్ష్మి, బిల్ల బాలరాజును నియమించినట్లు ఆమె తెలిపారు. వారు సంవత్సరం పాటు కమిటీలో ఉంటారని చెప్పారు.

మోడల్ స్కూల్ తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మోడల్ స్కూల్‌ను మండల ప్రత్యేక అధికారి మల్లేశం గురువారం తనిఖీ చేశారు. హాస్టల్, పాఠశాల గదులు పరిశీలించారు. కూరగాయలు, బియ్యం, సరుకులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాల సమీపంలో గడ్డిని తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంగీత, కవిత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోహెడరూరల్(హుస్నాబాద్): నాగసముద్రాల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన ఇంగ్లిష్ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.నర్సింహులు గురువారం తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 8వ తరగతి వరకు బోధించవలసి ఉంటుందని, దరఖాస్తుదారులు డిగ్రీ, బీఈడీ లేదా తత్సమాన అర్హత కలిగి టెట్ ఉత్తీర్ణత కలిగి ఉండాలని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు 7వ తేదీ సాయంత్రంలోగా తమ దరఖాస్తులను పాఠశాలలో అందించాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 96760 17302ను సంప్రదించాలని తెలిపారు.

పేలుళ్లు జరగొద్దు

ఏసీపీ నర్సింహులు

కొండపాక(గజ్వేల్): గోదాంలో పేలుళ్లు జరగకుండా మందుగుండు నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏసీపీ నర్సింహులు సూచించారు. కొండపాకలోని డిటోనేటర్ల(పేలుడు పదార్థాల) గోదాంను గురువారం ఆయన పరిశీలించారు. త్వరలో జరిగే ఎన్నికల నేపథ్యంలో డిటోనేటర్లు, మ్యాగ్జిన్లను భద్రపర్చే గోదాంలో ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తున్నారన్న విషయాన్ని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గోదాం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రతీ నెలా గోదాంను తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐ లతీఫ్, ఎస్‌ఐ శ్రీనివాస్, నిర్వాహకులు దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాల్‌మార్క్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రశాంతి

సిద్దిపేటఅర్బన్: హాల్‌మార్క్ ఉన్న బంగారాన్నే కొనుగోలు చేయాలని బీఐఎస్ హెచ్‌ఎంఆర్ ప్రశాంతి పిలుపునిచ్చారు. స్థానిక అర్బన్ ఐకేపీ కార్యాలయంలో గురువారం సీఏలకు బీఐఎస్ ఆధ్వర్యంలో హాల్‌మార్క్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులు బంగారం కొనుగోలు చేసే సమయంలో హాల్‌మార్క్ ఉన్న బంగారాన్నే కొనుగోలు చేయాలని, మార్క్ లేకపోతే బీఐఎస్ ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బీఐఎస్ యాప్ ద్వారా కూడా బంగారం నాణ్యతకు సంబంధించిన ధ్రువీకరణ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం రాష్ట్ర నేతలు కుంబాల రవీందర్, గుర్రాల శ్రీనివాస్, మహిళా సమాఖ్య నాయకులు కావ్య, జ్యోతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల సేవలు కీలకం



శిక్షణలో పాల్గొన్న బీఎల్‌ఓలు

దుబ్బాకటౌన్: ఎన్నికల వేళ నూతన ఓటరు నమోదు, తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రకియలో బీఎల్‌ఓ (బూత్‌లెవల్ ఆఫీసర్)ల పాత్ర కీలకమని తహసీల్దార్ సంజీవ్ కుమార్ అన్నారు. దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బూత్ స్థాయి అధికారుల జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మాస్టర్ ట్రైనర్లు మధుసూదన్, ఉమాశంకర్, శ్రీనివాస్ బీఎల్‌ఓలకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో 17వ తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఆన్‌లైన్‌లోనే పరీక్ష నిర్వహిస్తామని, పకడ్బందీగా ఓటరు జాబితా తయారు చేసే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీటీ రవి కుమార్, ఆర్ఐ హరికిషన్ రెడ్డి, రవీందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● బోనం.. ఘనం



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పాలమాకులలో గురువారం ఘనంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఊరేగింపుగా వెళ్లి నిర్వహించి పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ తల్లులకు బోనాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.

– నంగునూరు(సిద్దిపేట)



అమ్మవారికి సమర్పించిన బోనాలు

సంక్షిప్త వార్తలు

◆ అక్రమ అరెస్టులు సరికాదు: సీపీఎం

చేర్యాల(సిద్దిపేట): భువనగిరి ఎంపీ చామాల కిరణ్‌కుమార్‌రెడ్డి చేర్యాల పర్యటన సందర్భంగా సీపీఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో అన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయిస్తానని ప్రకటించిన ఎంపీ చామలను అడ్డుకోవాలని సీపీఎం నాయకులు ఇచ్చిన పిలుపు నేపథ్యంలో స్థానిక పోలీసులు గురువారం కొందరి నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని వెంకట్ మావో అన్నారు. అరెస్టయిన వారిలో అరుణ్, నాగరాజు, మల్లేశం, ప్రభాకర్, శ్రీనివాస్, నారాయణ, రాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

◆ వ్యక్తిగత కక్షలు పెట్టుకోవద్దు: సీఐ

సిద్దిపేటఅర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత కక్షలు పెట్టుకోవద్దని, ప్రజలు సహకరించాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ సూచించారు. అర్బన్ మండలం పొన్నాలలో గురువారం ఆయన పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికలను ఎన్నికలుగానే చూడాలన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం పొన్నాల జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు చట్టాలు, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం అంజలి, ట్రాఫిక్ ఏఎస్‌ఐ ఉమేశ్, షీటీం ఏఎస్‌ఐ కిషన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

◆ సీసీఎల్స్ మంజూరు చేయాలని వినతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సామాజిక కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి పీఆర్టీయూ నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తొగుట, మెట్టు, బందారుపల్లి, పెద్దమాసాన్ పల్లి, చందాపూర్, వెంకట్రావుపేట, జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాలల్లో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో డబుల్‌బెడ్రూంల పేరుతో నాణ్యత లేని ఇళ్లు నిర్మించి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, స్వామి, రేణుక, ప్రసాద్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రాంరెడ్డి, కొండల్‌రెడ్డి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ 14 నుంచి నిరవధిక సమ్మె

దౌల్తాబాద్(దుబ్బాక): టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని జేఏసీ జిల్లా కార్యదర్శి రామగౌని రవి కుమార్ గౌడ్ పిలుపునిచ్చార. దౌల్తాబాద్‌లో గురువారం దౌల్తాబాద్, రాయపోల్ మండల సెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ కోసం ఈ నెల 14 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. అలాగే 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూపతి రాజు, అంజద్, రాజశేఖర్, లక్ష్మణ్, రమేష్ రెడ్డి, రవీందర్, సత్తిరెడ్డి, ఆంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళల భద్రతకే షీ టీమ్

దౌల్తాబాద్(దుబ్బాక): మహిళల భద్రతకు షీ టీం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళలకు ఉన్న రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటలక్ష్మి, షీ టీం హెడ్ కానిస్టేబుల్ మహేందర్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ శ్యామల, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

మర్కూక్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎస్‌ఐ దామోదర్ అన్నారు. మండలంలోని చేబర్తి ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండో తరగతి విద్యార్థులకు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాందాస్‌గౌడ్ సౌజన్యంతో ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత గ్రామస్తులపై ఉందన్నారు. పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు, దాతలు తోడ్పాడాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శంకర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, మాజీ సర్పంచ్ అశోక్, స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.